క్లుప్తంగా

సావిత్రిబాయిపూలే గొప్ప సంఘ సంస్కర్త



మాట్లాడుతున్న నాయకులు

పాకాల : సావిత్రిబాయి పూలే గొప్ప సంఘ సంస్కర్త అని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు మనేరి ప్రభు, కార్యదర్శి గుండ్లపల్లి సుధాకర్ తెలిపారు. స్థానిక ఎమ్‌పీఎస్ పాఠశాల ఆవరణలో శుక్రవారం సావిత్రిబాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. వారు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే సాంఘిక దురాచారాలపై పోరాటాలు చేయడమే కాక మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా మహిళల విద్య కోసం ఎంతో కృషి చేశారని తెలిపారు. అనంతరం ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సృష్టికి మూలం మహిళలు



ఈఓపీఆర్డీ దేవకి, డాక్టర్ పవిత్రను సన్మానిస్తున్న సీడీఎస్ సిబ్బంది

రామచంద్రాపురం: మహిళలు సృష్టికి మూలమని కుప్పంబాదూరు పీహెచ్‌సీ వైద్యాధికారి పవిత్ర తెలిపారు. మండలంలోని కుప్పంబాదూరు సచివాలయంలో శుక్రవారం మహిళా వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ పద్మజారెడ్డి ఈఓపీఆర్డీ దేవకి, డాక్టర్ పవిత్రను సన్మానించారు. వారు మాట్లాడుతూ కుటుంబ పోషణలో మహిళల పాత్ర విలువ కట్టలేనిదన్నారు. మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలను చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మనీల, రేవతి, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

మున్సిపల్ పార్క్‌లో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వాకర్స్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ఎయిర్ బైపాస్ రోడ్డులోని ప్రకాశం మున్సిపల్ పార్క్‌లో శుక్రవారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ఉదయం వాకింగ్ చేసే వారి సౌకర్యార్థం చలివేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చినట్టు అసోసియేషన్ సహాయ కార్యదర్శి కోలా లక్ష్మీపతి, సభ్యులు చంద్రకాంత్, దామా రమణ తెలిపారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరెడ్డి, గోపీనాథ్ మాట్లాడుతూ వాకింగ్ ట్రాక్‌పై దుమ్ము, ధూళి లేకుండా ప్రతినిత్యం మున్సిపల్ వాటర్ ట్యాంక్ ద్వారా నీటిని చల్లించే కార్యక్రమాన్ని రేపటి నుంచి చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు వెంకటముని, రాజేశ్వరి, కమలమ్మ, యోగా గురువులు, సభ్యులు పాల్గొన్నారు.

ద్రౌపదీ దేవికి ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున అమ్మవారిని మేల్కొలిపి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. తదుపరి ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి భక్తి ప్రపత్తులతో పాలాభిషేకం చేశారు. వెండి తొడుగులతో కూడిన ఆభరణాలు, పట్టు పీతాంబరాలతో అమ్మవారిని ముస్తాబు చేశారు. విశేష పూజలానంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.

మహాభారత ఉత్సవాలు ప్రారంభం

శ్రీరంగరాజపురం: మండల కేంద్రంలోని దౌపదీ ధర్మరాజుల స్వామి ఆలయంలో శుక్రవారం మహాభారత ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ధ్వజారోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. దౌపదీ, పాండవుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి రోజూ హరికథతో పాటు రాత్రి వీధి నాటకం జరుగుతుందని ఆలయ ధర్మకర్త వేణు నాయుడు తెలిపారు.

పశువులకు గాలికుంటు టీకాలు



పాదిరేడులో పశువులకు టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది

వడమాలపేట: మండలంలోని పాదిరేడు పంచాయతీలోని పశువులకు శుక్రవారం గాలికుంటు టీకాలు వేశారు. డాక్టర్ గురునాథం మాట్లాడుతూ టీకా వేయడం వల్ల పాల ఉత్పత్తి తగ్గదన్నారు. మార్చి 31వ తేదీ వరకు కార్యక్రమం జరుగుతుందని, పాడి రైతులు పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని సూచించారు. పశు వైద్య సిబ్బంది ప్రతి గ్రామానికి వెళ్లి ఆవులు, గేదెలకు టీకాలు వేయాలన్నారు. మండలంలో ఇప్పటి వరకు 1596 టీకాలు వేశామని తెలిపారు. పశువైద్యాధికారి మురళీధర్‌రెడ్డి, డాక్టర్ శ్రీదేవి, లోకనాథం పాల్గొన్నారు.

వాహనంపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి



ఎంపీ, ఎమ్మెల్యేకు హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు



ఆత్మీయ స్వాగతం

ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి శుక్రవారం చంద్రగిరి సమీపంలోని చెర్లోపల్లిలో నిర్వహించిన ఆత్మీయ సభకు కార్యకర్తలు, వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు పోటెత్తారు. రాజంపేట, చిత్తూరు ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రీజనల్ కో-ఆర్డినేటర్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, పార్టీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యామ్ ప్రసాద్‌రెడ్డికి మహిళలు పూలు చల్లి హారతులు పట్టి ఆత్మీయ స్వాగతం పలికారు. వారు ఓపెన్ టాప్ జీపులో సభా ప్రాంగణానికి చేరుకున్నారు. అంతకుముందు పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీ చేపట్టారు.

\- సాక్షి, తిరుపతి



చెర్లోపల్లి సభా ప్రాంగణం వరకు ద్విచక్ర వాహనాలతో ర్యాలీగా వెళుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

రోడ్లపై వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు



అన్నమయ్య మార్గ్ రోడ్డుపై వున్న వ్యర్థాలను పరిశీలిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా : తిరుపతి నగర పరిధిలోని రోడ్లపై భవన నిర్మాణ వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి తెలిపారు. ఆమె శుక్రవారం ఇంజినీర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి అన్నమయ్య మార్గ్, డీబీఆర్ రోడ్లను పరిశీలించారు. నూతనంగా అభివృద్ధి చేసిన మాస్టర్ ప్లాన్ రోడ్లకు ఇరువైపులా భవన నిర్మాణ వ్యర్థాలు, కొబ్బరి బోండాలు, ఇతర వ్యర్థాలు వేయడాన్ని గుర్తించారు. టన్నుల కొద్ది వ్యర్థాలు పారబోయడం వల్ల రోడ్డు కళావిహీనంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో రోడ్లు, ఖాళీ స్థలాల్లో భవన నిర్మాణ వ్యర్థాలు, ఇతర చెత్తాచెదారాన్ని పారబోసే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. ట్రాక్టర్లను గుర్తించి భారీ జరిమానా విధించనున్నట్టు వెల్లడించారు. రెండోసారి పట్టుబడితే వాహనాలను సీజ్ చేయించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్టు చెప్పారు. భవన వ్యర్థాల నిర్వాహణ కోసం తూకివాకంలో భారీ ప్రాజెక్టు నిర్వహిస్తున్నామని, అక్కడికి తరలించేలా ఏర్పాట్లను పటిష్టం చేయనున్నట్టు చెప్పారు. కోట్లు వెచ్చించి రోడ్లను అభివృద్ధి చేస్తుంటే ట్రాక్టర్ల యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. వారిని ఉపేక్షించేది లేదని కఠిన చర్యలకు ఆదేశించినట్టు చెప్పారు. ప్రజలు భాగస్వాములై రోడ్డుపై వ్యర్థాలు పారబోసే ట్రాక్టర్లను గుర్తించి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి ఫొటోలను పంపించాలని కోరారు. తక్షణం రోడ్లపై వున్న వ్యర్థాలను తొలగించేలా అధికారులకు ఆదేశించారు. అదనపు కమిషనర్ సునీత, ఎస్ఈ మోహన్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, డీఈ విజయకుమార్‌రెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

ఆగని ఏనుగుల దాడులు



ఏనుగులు ధ్వంసంచేసిన మామిడి చెట్టు వద్ద బాధిత రైతు

పాకాల : మండలంలోని పదిపుట్లబైలు పంచాయతీ పరిసర ప్రాంతాల్లోని పంట పొలాల్లో ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. గురువారం రాత్రి ఏనుగుల గుంపు కొండకిందపల్లి కాడపల కృష్ణయ్య, పుల్లావాండ్లపల్లికి చెందిన తమ్మన్నగారి శంకరయ్య, మొద్రెబ్బగారి కృష్ణయ్య పంట పొలాల్లో బీభత్సం సృష్టించాయి. మామిడి తోటలు, కొబ్బరి చెట్లు, సపోటా, అరటి తోటలను నాశనం చేశాయి. ఈ విషయాన్ని శుక్రవారం ఉదయం గమనించిన రైతులు బాణసంచా పేలుస్తూ కొంతదూరం వెళ్లారు. రెండు రోజులు క్రితం కూడా ఏనుగుల గుంపు వరి పంటను నాశనం చేసిన సంగతి తెలిసిందే. అధికారులు స్పందించి నష్టపరిహారం అందేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

చేతక్ ప్రీమియం ఎలక్ట్రికల్ స్కూటర్ ఆవిష్కరణ



వాహనాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భూమన, షోరూమ్ అధినేతలు

తిరుపతి కల్చరల్: రేణిగుంట రోడ్డులోని శ్రీరామ్ ఎంటర్ ప్రైజెస్ షోరూమ్‌లో శుక్రవారం బజాజ్ చేతక్ ప్రీమియం ఎలక్ట్రికల్ స్కూటర్‌ను ఆవిష్కరించారు. ఇందులో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని స్కూటర్‌ను ఆవిష్కరించి మొదటి కస్టమర్‌కు అందజేశారు. ఆయన మాట్లాడుతూ శ్రీరామ్ ఎంటర్‌ప్రైజ్ మారుతున్న కాలానికి అనుగుణంగా సరికొత్త స్కూటర్లను అందిస్తూ ప్రజాఆదరణ పొందడం అభినందనీయమన్నారు. షోరూమ్ అధినేత, డీలర్ ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ 1990లో తొలిసారిగా చేతక్ స్కూటర్‌ను తాము ఆరంభించామన్నారు. ప్రస్తుతం బజాజ్ చేతక్ ఎలక్ట్రికల్ స్కూటర్‌ను ప్రారంభించడం ఆనందదాయకమన్నారు. ఇది 90 కిలోమీటర్ల మైలేజ్ ఇస్తుందని తెలిపారు. 4 గంటల పూర్తి చార్జితో ఇకోవో మోడ్‌లో కిలోమీటర్‌కు సుమారు 3 యూనిట్ల విద్యుత్ వినియోగం అవుతుందన్నారు. బజాజ్ ఫైనాన్స్ ద్వారా ఈఎంఐతో తీసుకోవచ్చని తెలిపారు. శ్రీరామ్ ఎంటర్‌ప్రైజెస్ చేతక్ డీలర్స్ ఆర్.సాకేతిరామ్, ఆర్.అభినవ్‌రామ్ బజాజ్ ఆటో జోనల్ మేనేజర్ గోపా శ్రీవాత్సవ్ పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో ఉపాధి వెలుగులు

రేణిగుంట: ఉపాధిహామీ పథకంతో వలసలు ఆగి పేదల జీవితాల్లో వెలుగులు విరబూస్తున్నాయని డ్వామా పీడీ శ్రీనివాప్రసాద్ అన్నారు. ఆయన శుక్రవారం సూరప్పకశంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వారికి రోజువారీ కూలి ఎంత గిట్టుబాటవుతోందో అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ 100 రోజులు పని చేయాలని కోరారు. కూలీల హక్కులను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జ్యోతి, ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

15న వారపు సంతకు వేలం

కార్వేటినగరం: మేజర్ పంచాయతీ కార్వేటినగరంలోని వారపు సంత, కూరగాయల మార్కెట్, బస్టాండ్, జంతు వధశాలలకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ ఈఓ మణి తెలిపారు. ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు పంచాయతీ కార్యాలయం ఆవరణలో వేలం పాట జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు వారపు సంతకు రూ. 50 వేలు, దినసరి మార్కెట్‌కు రూ.10 వేలు, బస్టాండ్‌కు రూ.10 వేలు, జంతు వధశాలకు రూ. 5వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని వివరించారు.

నేడు రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ వర్ధంతి

తిరుపతి కల్చరల్: అన్నమాచార్య ప్రాజెక్టు, హిందూ ధార్మిక సంస్థల సంయుక్తంగా శనివారం సాయంత్రం 6 గంటలకు అన్నమాచార్య కళామందిరంలో అన్నమయ్య సంకీర్తనలను రాగిరేకుల నుంచి పరిష్కరించి గ్రంథస్థం చేసిన రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు ఆకెళ్ల విభీషణశర్మ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి అనంతకృష్ణ శర్మ సాహిత్యంపై ఆయన మనవరాలు, సాతీయ సంస్కృత వర్సిటీ ఆంగ్ల శాఖ విభాగాధిపతి ఆచార్య రాళ్లపల్లి దీప్తి, మనవడు ప్రఖ్యాత వేణుగాన విద్యాంసుడు ఆర్.నందనందన, తెలంగాణ వర్సిటీ తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మణ చక్రవర్తి ఉపన్యసిస్తారు.

పోలీసు స్టేషన్‌కు చేరిన ఇంటర్ ప్రశ్నపత్రాలు



పోలీసు స్టేషన్ వద్దకు వచ్చిన ప్రశ్నపత్రాలు

చంద్రగిరి: ఇంటర్మీడియట్ ప్రశ్నపత్రాలు శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌కు చేరాయి. ఈ నెల 15వ తేదీ నుంచి 30 వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు జరగనున్నాయి. మండలంలో 6 సెంటర్లలో సుమారు 6 వేల మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో భాగంగా ప్రశ్నపత్రాలను కళాశాల అధ్యాపకులు స్టేషన్‌లో భద్రపరిచారు. వాటిని పరీక్షల ప్రారంభం రోజు ఉదయం ఆయా కేంద్రాలకు తరలిస్తామని పోలీసులు తెలిపారు.

పలువురికి జరిమానా

తిరుపతి లీగల్ : మద్యం తాగి తిరుమలకు వెళుతున్న తొమ్మిది మందికి రూ.1,800 జరిమానా విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోటేశ్వరరావు శుక్రవారం తిరుమల క్యాంప్ కోర్టులో తీర్పు చెప్పారు. ఈ నెల 5వ తేదీ సాయంత్రం తిరుమల ట్రాఫిక్ స్టేషన్ ఎస్ఐ రామచంద్రా నాయక్ తిరుమల జీఎన్‌సీ టోల్‌గేట్ వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో మద్యం తాగి తిరుమలకు వాహనంలో వెళుతున్న 9 మందిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. వారికి జడ్జి జరిమానా విధించారు. అలాగే తిరుమలలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న 23 మందికి రూ.4,600 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

నిందితుడికి రిమాండ్

తిరుమల పీఏసీ హాల్ నంబర్ 1లో చార్జింగ్ పెట్టిన సెల్ ఫోన్‌ను చోరీ చేసిన కేసులో రాజస్థాన్ రాష్ట్రానికి చెంది ప్రస్తుతం హైదరాబాద్ నాంపల్లిలో ఉంటున్న ప్రదీప్ అనే వ్యక్తికి ఈ నెల 23వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. అతన్ని తిరుమల టూ టౌన్ పోలీసులు అరెస్టు చేసి జడ్జి ఎదుట హాజరుపరిచారు.

పంచాయతీకి రూ.5.41 లక్షల ఆదాయం



వేలం పాటలు నిర్వహిస్తున్న పంచాయతీ ఈవో మహేశ్వరయ్య

చంద్రగిరి: వేలం పాటల ద్వారా చంద్రగిరి పంచాయతీకి రూ.5.41 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈవో మహేశ్వరయ్య తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను సర్పంచ్ ముదికుప్పం రూప అధ్యక్షతన శుక్రవారం వారపు సంత, ప్రైవేటు బస్టాండ్, జంతు వధశాల, మరుగుదొడ్లు, ఆర్‌వో వాటర్ ప్లాంట్ల నిర్వాహణకు వేలం పాటలు నిర్వహించారు. వారపు సంతను చంద్రగిరికి చెందిన సునీల్ రూ.23,24 లక్షలకు, ప్రైవేటు బస్టాండును కె.యల్లయ్య రూ.7 లక్షలకు, జంతు వధశాలను రూ.1,09,500కు, మరుగుదొడ్లను రూ,7,700కు, ఆర్‌వో వాటర్ ప్లాంటును రూ.2,800లకు దక్కించుకున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది పంచాయతీ ఆదాయం సరాసరి రూ.5.41 లక్షలు పెరిగినట్లు ఈవో తెలిపారు.

జగనన్న సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి



ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, మేయర్ శిరీష

తిరుపతి మంగళం : ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలే పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపిస్తాయని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం మేయర్ శిరీషతో కలిసి 41, 45వ డివిజన్లలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ప్రజాసంక్షేమంతో పాటు సచివాలయ వ్యవస్థ ద్వారా లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి ఆదుకున్నారని తెలిపారు. ఎప్పటికప్పుడు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఆయన బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. తిరుపతిలో ప్రతి ఒక్క ఓటరూ ఓటు వేసేలా కార్పొరేటర్లు, పార్టీ నాయకులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. 2024లో జరగబోయే ఎన్నికలకు ఎమ్మెల్సీ ఎన్నికల నుంచి విజయ దుందుభి మోగిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ డాక్టర్ అనీష్ కుమార్, నాయకులు కదిరి రాజేంద్ర, రాజేష్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, జయభరత్‌రెడ్డి, బాలు, వేణుగోపాల్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, చంద్ర, టౌన్ బ్యాంకు డైరెక్టర్ వేమూరి జ్యోతిప్రకాష్, కంకనాల రమేష్, వెంకటముని, శ్రీదేవి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

రేపు బలిజ భవన్ ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ



మాట్లాడుతున్న డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ

తిరుపతి కల్చరల్: నరసింహతీర్థం రోడ్డులోని బలిజ భవన్‌కు ప్రహరీ గోడ నిర్మాణానికి ఆదివారం ఉదయం భూమి పూజ చేపట్టనున్నట్టు డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ, బలిజ జేఏసీ అధ్యక్షుడు నీలం బాలాజీ తెలిపారు. వారు శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. తిరుపతి నగరంలో బలిజ భవన్ కోసం పోరాటాలు చేసిన కారణంగా నరసింహతీర్థం రోడ్డులో 1.50 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించిందన్నారు. భవన నిర్మాణం చేపట్టకపోవడంతో స్థలం కబ్జాకు గురవుతోందన్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆదేశాల మేరకు అధికారులు స్థలాన్ని సర్వే చేసి పరిశుభ్రం చేశారని తెలిపారు. ఈ క్రమంలో ప్రహరీ గోడ నిర్మించాలని నిర్ణయించామని తెలిపారు. ఇందుకోసం ఎమ్మెల్యే భూమన రూ.5 లక్షలు అందజేశారని తెలిపారు. సమావేశంలో బలిజ, కాపు నేతలు ఆర్కాట్ కృష్ణప్రసాద్, బాలిశెట్టి కిశోర్, ఆళ్వార్ మురళి, వెంకటేష్ రాయల్, అనిల్ రాయల్, ఐఆర్.రవి, కరుణానిధి పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో శాస్త్రి ఇండో కెనెడియన్ సంస్థ ప్రతినిధి



డాక్టర్ మహముదా అల్దీన్‌ని సత్కరిస్తున్న మహిళా వర్సిటీ మాజీ వీసీ తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్ : శాస్త్రి ఇండో కెనెడియన్ సంస్థ ప్రోగ్రామ్ అండ్ మెంబర్ రిలేషన్స్ ఆఫీసర్ మహముదా అల్దీన్ శుక్రవారం పద్మావతి మహిళా వర్సిటీని సందర్శించారు. పొటెన్షియల్ ప్రాంతాలను గుర్తించి కెనెడాలోని వివిధ వర్సిటీలతో అనుసంధానం చేసేలా అధికారులతో చర్చలు జరిపారు. తద్వారా పరిశోధన, విద్యార్థి, ఫ్యాకల్టీ మార్పు కార్యకలాపాలకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని తెలిపారు. విద్యార్థినులకు ఫారిన్ ఎక్స్‌పోజర్‌కు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగానికి రెండు ప్రాజెక్టులను మంజూరు చేశారు. ఈ ప్రాజెక్టులో భాగంగా కెనడా నుంచి సంబంధిత ప్రొఫెసర్లు ఏప్రిల్‌లో ఆ విభాగాన్ని సందర్శించి హెచ్‌ఆర్ సిములేషన్, పవర్ టాబ్లే వంటి అడ్వాన్స్‌డు టెక్నిక్స్‌పై రెండు వారాలు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్సిటీ మాజీ వీసీ దువ్వూరు జమున, డీన్లు అనూరాధ, సుజాత, ఇంటర్నేషనల్ రిలేషన్స్ అసోసియేట్ ప్రొఫెసర్ నిర్మల, బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి విజయలక్ష్మి, రజని, రూప పాల్గొన్నారు.

వైభవంగా మూలస్థాన ఎల్లమ్మ ఊంజల్ సేవ



మూలస్థాన ఎల్లమ్మ ఊంజల్ సేవలో పాల్గొన్న ఎమ్మెల్యే చెవిరెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మీ

చంద్రగిరి: చంద్రగిరి గ్రామదేవతగా పూజలందుకుంటున్న మూలస్థాన ఎల్లమ్మకు శుక్రవారం ఊంజల్ సేవ ఘనంగా చేపట్టారు. అమ్మవారిని ఉదయం సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. రాహుకాల సమయంలో పరివార దేవత ఉగ్రప్రత్యంగిరా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. రాహుకాల అభిషేక తీర్థాన్ని చల్లుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తికి ఆలయ ఆలరణలో ఊంజల్ సేవను ఘనంగా ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి ఇందులో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి ఆమెకు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ చైర్మన్ మాట్లాడుతూ మూలస్థాన ఎల్లమ్మ వెలసి వందల ఏళ్లు గడిచాయన్నారు. ఆలయ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మొట్టమొదటి సారి ఊంజల్ సేవను శుక్రవారం నుంచి ప్రారంభించామని పేర్కొన్నారు. ఇకపై ప్రతి శుక్రవారం సాయంత్రం ఆలయ ఆవరణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రామకృష్ణారెడ్డి, పాలక మండల సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.